క్లుప్తంగా

ఘనంగా ప్రారంభమైన ఏకాహం



మునగపాక సాయిబాబా మందిరంలో పూజలు

మునగపాక : మునగపాక షిర్డీసాయి బాబా మందిరంలో గురువారం ఏకాహం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం నుంచి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు భజన కార్యక్రమాలు నిర్వహించారు. సాయి నామస్మరణతో మునగపాక మార్మోగింది. ఏకాహంలో భాగంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ బొడ్డేడ వీరేంద్ర తగు ఏర్పాట్లు చేశారు.

భక్తి శ్రద్ధలతో సాంబశివుని పెళ్లిరాట



సాంబశివుని పెళ్లిరాటలో పాల్గొన్న భక్తులు

మునగపాక : మునగపాకలోని సాంబశివుని ఆలయంలో స్వామి పెళ్లిరాట మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈనెల 18న స్వామి కల్యాణోత్సవం జరగనుంది. ఈ సందర్భంగా వేపచెట్టుకు మహిళలు భక్తి శ్రద్ధలతో పూజలు చేసిన అనంతరం రాట వేశారు. ఆలయ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు, సర్పంచ్ దిమ్మల అప్పారావు, దాడి శ్రీరామమూర్తి, పాలిమేర కృష్ణ, కాశీబాబు, ప్రకాశరావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉగాదికి గృహ ప్రవేశాలు జరగాలి



మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ ప్రసాద్

మునగపాక : ఉగాదికి గృహ ప్రవేశాలు పెద్ద సంఖ్యలో జరిగేలా చూడాలని హౌసింగ్ డీఈ పి.ప్రసాద్ కోరారు. స్థానిక మండల పరిషత్ హాలులో గురువారం హౌసింగ్‌పై సమీక్ష నిర్వహించారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతమయ్యేలా అధికారులు పాటు పడాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే సాయాన్ని సద్వినియోగం చేసుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని, కాలనీల్లో మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చేలా చూడాలని సూచించారు. ఎంపీడీవో రవికుమార్, ఈవోఆర్డీ ఈశ్వరరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సమావేశంలో పాల్గొన్నారు.

గ్రామీణ గ్రంథాలయం సందర్శన



రికార్డులు పరిశీలిస్తున్న చోడవరం గ్రంథాలయాధికారి తిరుమల కుమారి

మునగపాక : తిమ్మరాజుపేట గ్రామీణ గ్రంథాలయాన్ని గురువారం చోడవరం గ్రంథాలయాధికారి తిరుమల కుమారి సందర్శించారు. గ్రంథాలయంలో పుస్తకాలు తిలకించి, పాఠకులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అలాగే గ్రంథాలయ పన్ను, ఫర్నిచర్ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయాధికారి దొడ్డి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్కంఠగా సాగుతున్న క్రికెట్ టోర్నీ

కోటవురట్ల: కె.వెంకటాపురంలో శ్రీ నూకాంబిక అమ్మవారి జాతర మహోత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ ఉత్కంఠగా సాగుతోంది. అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా పలు టీమ్స్ తలపడుతుండగా టోర్నీ తుది దశకు చేరుకుంది. ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ విజేత టీమ్‌కు రూ.10 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.8 వేలు నగదు అందించనున్నట్టు తెలిపారు. ఉత్సవాలలో భాగంగా వాలీబాల్, మహిళల కబడ్డీ పోటీలు కూడా నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయం



చినదొడ్డిగల్లు పాఠశాలలో పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమంలో విద్యార్థులు



పేట బయ్యవరం పాఠశాలలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు



యలమంచిలిలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు



పాయకరావుపేట జెడ్పీ హైస్కూల్లో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించిన ఉపాధ్యాయులు

యలమంచిలి : అమర జీవి పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయమని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. గురువారం యలమంచిలి పట్టణంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు 122వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎంపీపీ బోదెపు గోవింద్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాష మాట్లాడే తెలుగు ప్రజలకు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనకు అహర్నిశలు కష్టపడ్డ మహోన్నత వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అని, ఆయన త్యాగ ఫలమే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సాధించగలిగామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి మున్సిపల్ వైస్ చైర్మన్ అరెపు గుప్త, మాజీ ఎంపీపీ బొద్దపు యర్రయ్యదొర, రూరల్ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, రంగాపెద్ద, నేటి సురేష్, కట్టా బాబ్జీ, పరమాత్మ పాల్గొన్నారు.

పేట బయ్యవరంలో..

మండలంలో పేట బయ్యవరం గ్రామంలో స్వాతంత్ర్య సమరయోధులు దాసరి రమణ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పొట్టి శ్రీరాములు 122వ జయంతి విద్యార్థుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రరాష్ట్రం కోసం ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకొని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాపాజీరావు, ఉపాధ్యాయులు, బోడ్డేడ సత్యనారాయణ, రవీంద్ర, ప్రవీణ్, మర్రి పాపారావు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాయకరావుపేట : జెడ్పీ ఉన్నత పాఠశాల, కెహెచ్ వాడలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి విద్యార్థులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం వల్లే ఆంధ్రరాష్ట్రం సిద్ధించిందని ఉపాధ్యాయులు శ్రీనివాస్, భావన్నారాయణ, పద్మ, పీఈటీ ప్రసాద్ విద్యార్థులకు వివరించారు. 5వ తరగతి విద్యార్థి కోరగంటి దుర్గా యశ్వంత్ పొట్టి శ్రీరాములు ఏకపాత్రాభినయం చేసి అందరినీ మెప్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుందరరావు పాల్గొన్నారు.

నక్కపల్లి : అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని గురువారం నక్కపల్లిలో ఘనంగా నిర్వహించారు. చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.జనార్దన్ ఆధ్వర్యంలో శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో అమరజీవికి ఘనంగా నివాళులర్పించారు. జనార్దన్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు కోట్లాది మంది ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం అప్పారావు, పీడీ కుందూరురాజు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యమాంబ అమ్మవారి జాతర



అమ్మవారి గుడి వద్ద భక్తులు

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని నునపర్తిలో గురువారం ముత్యమాంబ అమ్మవారి జాతర ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం తప్పెటగుళ్లు, కోలాటాలు, సేవ గరిడీలు, తాటిపెద్దు సేవలతో అమ్మవారి ఘటాల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ద్వితీయ ఇంటర్ పరీక్షలు తొలిరోజు ప్రశాంతం



పరీక్షలకు హాజరైన ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు

పాయకరావుపేట : ఇంటర్‌మీడియేట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. పట్టణంలో గల శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాలకు చెందిన 493 మంది విద్యార్థులు, కార్తికేయ జూనియర్ కళాశాలకు చెందిన 424 మంది విద్యార్థులు, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన 487 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. కార్తికేయ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గల పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుకు వినతి



హాస్టల్‌లో వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని కోరుతున్న ప్రజాసంఘాల నాయకులు

తుమ్మపాల : ఎస్.రాయవరం మండలం లింగరాజుపాలెం మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల హాస్టల్లో ప్రభుత్వం ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రజా సంఘాల నాయకులు గురువారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారత అధికారిణి రాజేశ్వరిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికల పాఠశాలలో సరైన వసతులు లేమి కారణంగా విద్యార్థులు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారని, తక్షణమే వైద్యశిబిరం నిర్వహించాలని కోరారు. సౌకర్యాలు, ఆహారం, వసతులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఆమె అధికారులతో మాట్లాడి త్వరలో వైద్య శిబిరం నిర్వాహించేందుకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ప్రజా రాజకీయ వేదిక కన్వీనర్ కనిశెట్టి సురేష్‌బాబు, అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు డోలం బుసిరాజు, గ్రామ స్వరాజ్య వేదిక సహాయ కార్యదర్శి శివశంకర్ పాల్గొన్నారు.

కాపు కార్పొరేషన్‌కు నిధుల పెంపుపై హర్షం



వీసం రామకృష్ణ

నక్కపల్లి : రాష్ట్ర బడ్జెట్‌లో కాపుల సంక్షేమానికి రూ.4887 కోట్లు కేటాయించడం పట్ల రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వీసం రామకృష్ణ హర్షం ప్రకటించారు. గురువారం ఆయన నక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడుతూ కాపుల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో కట్టుబడి ఉందన్నారు. కాపు నేస్తం పథకం ద్వారా ప్రతిఏటా ఆర్థిక సాయం అందించేందుకు బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించారన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో నిధులు పెంచి కేటాయించడం పట్ల సీఎంకు కాపుల తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

కార్మికుల భద్రతకు ప్రాధాన్యం

- డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సురేష్



కార్మికులకు బహుమతులు ప్రదానం చేస్తున్న డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ సురేష్, మైహోమ్ ప్రతినిధులు

యలమంచిలి : సిమెంట్ కర్మాగారం కార్మికుల భద్రతకు ఎంతో ప్రాధాన్యం కల్పిస్తున్నట్టు డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వి.సురేష్ అన్నారు. యలమంచిలి మండలం ములకలాపల్లి వద్ద మైహోమ్ ఇండస్ట్రీస్ (సిమెంట్ కర్మాగారం)లో గురువారం 52వ జాతీయ భద్రతా వారోత్సవాలు ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశాఖపట్నంకు చెందిన డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వి.సురేష్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్.పి.చిన్నారావు హాజరై స్థానిక సిమెంట్ కర్మాగారంలో కార్మికులకు భద్రతపై అవగాహన కల్పించారు. పనిచేసే ప్రదేశాల్లో భద్రతా ప్రమాణాలు పాటించడంతో పాటు ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, రిస్క్ ప్రదేశాల్లో సేఫ్టీ పరికరాలను వాడాలని సూచించారు. భద్రతా వారోత్సావాల్లో భాగంగా ఫ్యాక్టరీలో కార్మికులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మైహోమ్ ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వి.హెచ్ చౌదరి, జీఎం.బి.రామస్వామి, సీనియర్ డీజీఎం ఎల్. శ్రీనివాసరావు, డిప్యూటీ మేనేజర్ సతీష్‌రెడ్డి , ఉద్యోగులు,కార్మికులు పాల్గొన్నారు.

కంటి రోగులకు ఉచిత శస్త్ర చికిత్సలు



ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు పొందిన రోగులు

అచ్యుతాపురం (అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని బ్రాండిక్స్‌లో ఈ నెల 12న నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో ఆపరేషన్‌కు సూచించిన రోగులు శస్త్ర చికిత్సలు పూర్తి చేసుకొని క్షేమంగా గురువారం ఇంటికి చేరుకున్నారు. 33 మందికి బ్రాండిక్స్ వాహనాల్లో ఆస్పత్రి నుంచి ఇళ్లకు పంపించారు.

వికలాంగుల ఆశ్రమంలో రేషన్ పంపిణీ



పట్నాయక్‌కు రేషన్ సరకులు అందజేస్తున్న దాతలు

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురంలోని సమీకృత వికలాంగుల ఆశ్రమంలో మనం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఒక నెల రోజులకు సరిపడా రేషన్‌ను అందజేశారు. లంకెపాలేనికి చెందిన ప్రసాద్, కైరాల్ దంపతుల కుమార్తె జెస్సికా పుట్టిన రోజును పురస్కరించుకొని గురువారం ఈ సేవా కార్యక్రమం చేపట్టారు. రేషన్ సరకులను ఆశ్రమ నిర్వాహకులు పట్నాయక్ సమక్షంలో అందజేశారు. మురుకుర్తి గోపి, పండూరి సురేష్, తంగేటి సూర్యప్రకాశ్, నమ్మి శంకర్, దేవర కృష్ణ పాల్గొన్నారు.

30న సీతారామ కల్యాణం



కల్యాణ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ

అనకాపల్లిటౌన్ : స్థానిక చినబజారు సీతారామాలయంలో ఈ నెల 30న సీతారాముల కల్యాణ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ శాశ్వత గౌరవాధ్యక్షుడు కొణతాల జగన్నాథంనాయుడు తెలిపారు. గురువారం ఆలయ ఆవరణలో కల్యాణ కరపత్రాన్ని ఉత్సవ కమిటీ సభ్యుల సమక్షంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 27న స్వామివారి పెళ్లిరాట మహోత్సవం, 30న సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. టీటీడీ నుంచి తీసుకొచ్చిన స్వామివారి ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం, ఊరేగింపు నిర్వహించి, అనంతరం కల్యాణం జరపడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

ఎల్లయ్యకాలువలో పూడికలు తొలగించాలి



కాలువను పరిశీలిస్తున్న ప్రజాసంఘాల నేతలు

అనకాపల్లిటౌన్ : పట్టణం మధ్య నుంచి పంట పొలాలకు సాగునీరందించే ఎల్లయ్యకాలువ జీవీఎంసీ అధికారుల నిర్లక్ష్యం వల్ల నిరుపయోగంగా మారుతోందని ప్రజాసంఘాల నేతలు ఆరోపించారు. స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానం మీదుగా ప్రవహిస్తున్న ఎల్లయ్యకాలువ వద్ద సంఘాల నేతలు గురువారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుమ్మపాల పంచాయతీ, గుండాల కూడలి నుంచి పూల్‌బాగ్ రహదారి మీదుగా పారుతున్న ఈ కాలువ పూడికలతో నిండిపోయిందన్నారు. సాగునీటి కాలువలో తక్షణమే పూడికలు తొలగించాలన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500 కే వంటగ్యాస్

కశింకోట : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమాన్ని గురువారం కశింకోటలో నిర్వహించారు. పంచాయతీ ప్రధాన రహదారిలోని శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం హాత్ సే హాత్ జోడో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పార్టీ అధికారంలోకి వస్తే రూ.500కే వంట గ్యాస్ అందించడంతోపాటు, ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేస్తుందన్నారు.

ఆ గ్రామాలకు వెళ్లాలంటే పాట్లు పడాల్సిందే!



అధ్వానంగా ఉన్న తడపర్తి రహదారి

కోటవురట్ల : మైదానమైనా గిరిపుత్రులకు అవస్థలు తప్పడం లేదు. గిరి గ్రామాలకు సరైన సౌకర్యాలు లేక ఏళ్ల తరబడి ఇక్కట్లు పడుతూనే ఉన్నారు. రహదారి, విద్య, వైద్యం ఇలా అన్నింటా సమస్యలే. మండలంలో 9 గిరిజన గ్రామాలు ఉన్నాయి. ప్రధానంగా రహదారి సమస్య గిరి గ్రామాలను పట్టి పీడిస్తోంది. వైద్య సమస్యలు వచ్చినపుడు మండల కేంద్రానికి అవస్థలు పడుతూ చేరుకుని చికిత్స పొంది వెళుతుంటారు. టి.జగ్గంపేట శివారు తడపర్తి గ్రామానికి వెళ్లే రహదారి రాళ్ల రప్పలతో అధ్వానంగా ఉంది. కె.వెంకటాపురం నుంచి సుమారు 6 కిలోమీటర్ల దూరంలో తడపర్తి ఉంది. ఇక్కడి నుంచి మరో 2 కిలోమీటర్ల దూరంలో శ్రీరాంపురం ఉంది. ఈ రెండు గిరిజన గ్రామాలకు వెళ్లాలంటే పడరాని పాట్లు పడాల్సిందే. ఆ రహదారిలో కాలి నడక కూడా నరకంగానే ఉంటుందని అక్కడికెళ్లిన వారికి ఇట్టే అర్థమవుతుంది. రోడ్డు అంతా కోరుకుపోయి, పెద్ద రాళ్లు తేలి దారుణంగా తయారైంది. ద్విచక్ర వాహనాలపై వెళ్లాలంటే సాహసం చేయాల్సిందే. ఈ రెండు గ్రామాల్లో సుమారు 100 కుటుంబాలు జీవిస్తున్నాయి. వీరంతా మైదానంలో ఉన్నప్పటికీ ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన సంప్రదాయలను పాటిస్తున్నారు. ఇపుడిపుడే యువత ఆధునికత వైపు అడుగులు వేస్తూ జీవన అలవాట్లు మార్చుకుంటున్నారు. ఎన్నో ఏళ్లుగా తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని గత ప్రభుత్వాలను వేడుకున్నా ఉపయోగం లేకపోయింది. ప్రస్తుత ప్రభుత్వంలో రహదారి నిర్మాణం కోసం సర్వే చేసి ప్రతిపాదన పెట్టగా అది ఆచరణకు నోచుకోలేదు. రహదారిలో కొంత భాగం అటవీ శాఖకు చెందిన ప్రాంతం కావడంతో కేంద్రం నుంచి అనుమతి రావడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ సమస్యను పరిష్కరించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీవో రవికుమార్ తదితరులు

మునగపాక : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అమరజీవి పొట్టి శ్రీరాముల జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో పి.రవికుమార్‌తో పాటు ఇతర అధికారులు ఆయన చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణకు పొట్టి శ్రీరాములు తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ఈవోఆర్డీ ఈశ్వరరావు, మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి మోహిని, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

శిథిల భవనంతో పొంచి ఉన్న ప్రమాదం



కూలడానికి సిద్ధంగా ఉన్న పాఠశాల భవనం

కోటవురట్ల : మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల పాత భవనం పూర్తి శిథిలమై పైకప్పు కూలిపోతోంది. గోడలు బీటలు వారి కొంచెం కొంచెం పడిపోతున్నాయి. ఈ భవనం సుమారు ఏడేళ్ల క్రితం శిథిలం కావడంతో పక్కనే కొత్త భవనాన్ని నిర్మించారు. ప్రస్తుతం తరగతులు కొత్త భవనంలోనే జరుగుతున్నప్పటికీ పక్కనే శిథిల భవనం ఆందోళన కలిగిస్తోంది. విద్యార్థులు విశ్రాంత సమయంలో ఈ భవనం పక్కనే తిరుగుతుంటారు. ఇప్పటికే చాలా వరకు శిథిలమై కూలిపోతుండగా విద్యార్థులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ భవనాన్ని తొలగించాలని ఎమ్మార్సీ నుంచి గతంలో ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చినప్పటికీ దీనిని తొలగించకుండా అలానే వదిలిపెట్టారు. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి శిథిల భవనాన్ని తొలగించాలని పలువురు కోరుతున్నారు.

అదనపు నిధులకు వినతి



జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రకు వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ కాకర దేవి

ఎస్.రాయవరం: మండలంలో అభివృద్ధి పనులు చాలా ఎక్కువగా ఉన్నాయని జెడ్పీ నుంచి అదనపు నిధులు కేటాయించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్రను ఎస్.రాయవరం జెడ్పీటీసీ కాకర దేవి కోరారు. బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయానికి వెళ్లిన జెడ్పీటీసీ చైర్మన్‌తో సమావేశం అయ్యారు. మండల అభివృద్ధి కోసం చేపట్టాల్సిన పనుల వివరాలు పొందుపరుస్తూ వినపత్రం అందజేశారు. సాధారణ నిధులతో పాటు మండలానికి అదనంగా మరికొంత నిధులు కేటాయించాలని కోరామన్నారు. దీనికి జిల్లా పరిషత్ చైర్మన్ సానుకూలంగా స్పందించారన్నారు.

ఇంటిపన్నుల వసూలుపై దృష్టి సారించండి

పాయకరావుపేట : గ్రామాల్లో ఇంటిపన్నుల వసూలుపై దృష్టి సారించాలని ఈవోఆర్డీ సిహెచ్.చంద్రశేఖర్ అన్నారు. ఆయన గ్రామ సచివాలయాల్లో సిబ్బందితో సమావేశాలు ఏర్పాటు చేసి ఇంటి పన్నులు వసూలు చేయాలని ఆదేశిస్తున్నారు. అదే విధంగా చెత్త నుంచి సంపద కేంద్రాలను పరిశీలించి అభివృద్ధి చేయాలని సచివాలయ సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం గోపాలపట్నం గ్రామంలో సచివాలయ సిబ్బందితో సమావేశమై గ్రామాల్లో పారిశుధ్య లోపం తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సర్పంచ్ పన్నీరు బాబ్జి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ఎస్.రాయవరం : పి.ధర్మవరం గ్రామంలో శుక్రవారం అచ్చుత్ హెల్పింగ్ హ్యాండ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి 4 గంటల వరకు శ్రీ తులసి కళ్యాణ మండపంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. విశాఖపట్నానికి చెందిన సాగర్‌దుర్గ, సింహాద్రి, పుష్పగిరి ఆస్పత్రి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

దిమిలిలో జోరుగా పారిశుధ్య పనులు

రాంబిల్లి : దిమిలి గ్రామంలో గురువారం ప్రత్యేక పారిశుధ్య పనులను నిర్వహించారు. సర్పంచ్ బంగారు చిలుకు పారిశుధ్య పనులను పరిశీలించారు. పొక్లెయిన్ సాయంతో చెత్తాచెదారాన్ని తొలగింపజేశారు. మురుగుకాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. కొత్త అమవాస్య నూకాంబిక అమ్మవారి పండగ, ఉగాది పండగల నేపథ్యంలో ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ చిలుకు తెలిపారు.

ప్రహరీ పనులు నిలిపివేయాలి

రాంబిల్లి: నేవీ ప్రహరీ పనులను నిలిపివేయాలని పెదకలవలాపల్లి, వై.లోవ గ్రామస్తులు మరోసారి కోరారు. గత వారం ప్రహరీ పనులను ఆయా గ్రామాల ప్రజలు అడ్డుకున్న సంగతి తెలిసిందే. అయితే గురువారం మళ్లీ పనులు చేస్తుండడంతో మరోసారి ఈ గ్రామాల ప్రజలు పనులు చేయవద్దని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో అటవీ, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు వచ్చి తమతో మాట్లాడినట్టు పెదకలవలాపల్లి సర్పంచ్ యలమంచిలి కనకారావు తెలిపారు

20 నుంచి నూకాంబిక కొత్త అమావాస్య ఉత్సవాలు

కశింకోట : కశింకోటలో ప్రసిద్ధి చెందిన నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య ఉత్సవాలు ఈ నెల 20 నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త వేగి శివగణేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు సాయంత్రం జాలర్ల జాతర, సారె ఊరేగింపు, రాత్రి అమ్మ వారి జాగరణ, 21న కొత్త అమావాస్య జాతర సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. ఉదయం వెలమ సంక్షేమ సంఘం, సాయంత్రం చౌడేశ్వరి దేవాంగుల సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో సారె ఊరేగింపులు, ప్రభలతో అమ్మ వారి ఘటాల ఊరేగింపు, అనంతరం ఆలయం వద్ద అగ్ని గుండాలు తొక్కడం తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. 22న ఉగాది సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.